భైక్షుకదంపతులూ ఆ బిందే ఆ వస్తువులూ తిరిగి ఎవరికీ ఎక్కడా పట్టుపడలేదు. కాని దొంగఎవడో ఆవిడ వస్తువులూ బిందే బలాత్కారంగా తీసికొనిపోయినాడనీ వెల్లడైంది.

* * * * *

కొన్నాళ్ళకు ముసిలిమొగుడు అరుగుమీద కూర్చొని యుండగా బిచ్చగాడువచ్చి "స్వామీ! మీ ఆవిడ ఆనాడు నాకిచ్చిన బిందే, వస్తువులు" అన్నాడు. "ఏం తిరిగి పట్టుకొచ్చేవు. వెట్టిముండాకొడకా!" అంది యువతి అప్పటికి కొంచెం ఆరితేరిన గొంతు కనబట్టో ఇంటనుండబట్టో—"నాపోలి చచ్చిపోయింది. నా పోలి చచ్చిపోయింది ఇంకెవరికి?" అని ఏడుస్తూపోయినాడు బిచ్చగాడు.

వృద్ధభర్త కేమనడానికీ పాలిపోలేదు. "నీ యవ్వనం ...బెట్టి చావలేకపోయేవు ఆనాడు." అన్నాడు లోపలకువెళ్ళి. "ఎద్దడినీళ్ళవడంచేత చావలేదు" అంది ఆమె అతినిబ్బరంగా.

ముసిలిబాపనయ్య కుళ్ళికుళ్ళి చనిపోయినాడు. కాని ఆమెకు వర్చస్సు మాఱలేదు.—

కొన్నాళ్ళకు నడువీధిలో మంచినీళ్ళనుయ్యి తీయించేరు సర్కారువారు. నూతిప్రతిష్ఠయిననాటిరాత్రే ఆ బాపనపితంతువు అందులోపడి మృతిజెందింది. ఊరంతా నుయ్యి బలికోరిందను కొన్నారు.

.... .... .... .... ....

## సుకారీ, లంబాడీ, మరాటీ

"సుకారీ, లంబాడీ, మరాటీ" ఈ తెగల్లో ఏ తెగవాళ్ళు వీళ్ళని చూస్తున్నాను—గుంపుగా కొందఱు గోదావరివంచే దిగి అవతల

వొడ్డునున్న కొవ్వూరుకు పడవలమీద చేరుకుందామనుకుంటూ కాసర బీసరగా మాటలాడుకునే జనుల్ని చూచి. వాళ్ళ తాలూకు వంద వందఏభై గాడిదలు గూడులేని పెద్దతొట్టిపడవలో కెక్కి నిలుచుండాయి ఓ గూడున్న తొట్టిపడవమీద అటూ ఇటూ పది పదిహేను బళ్లు చక్రాలూడగొట్టినవి కొన్నీ, కాడి లాగివేసినవి కొన్నీ. చక్రాలు కుదేసినవికొన్నీ నదిదాటేవిధంగా అమరింపు సూచిస్తున్నాయి. గూటిగుండా సామాను తొంగిచూస్తూవుంది. మనుష్యులుమాత్రం ఇంకా వొడ్డుపైనే వండుకొంటూ కొందఱు, పండుకొని కొందఱు, ఆడుకొంటూ కొందఱు, పాడుకొంటూ కొందఱు చెలరేగుతూ వున్నారు.

" మరాటీగుంపు " అన్నాడు గట్టేనడచిపొయ్యే పాంధుడు, " వాళ్ళదగ్గఱ డబ్బు నిలవవుంటుంది. కాని అది వాళ్ళదగఱ వుంచుకోడానికి వీల్లేదు. ఏసాయంత్రాని కాసాయంత్రం వాళ్ళను గాపలా గాచే రక్షకభటులికి అప్పజెప్పివేయవలసినదే——అరుగో రక్షకభటులు అని అక్కడే కూర్చుని దిగాల్మొగంగావున్న పోలీసుల్ని చూపించేడు.

నేనారక్షకభటుల్ని చూస్తూ " అయితే యీతండావాళ్ళకి స్వేచ్ఛలేదు. ఆ జనాన్ని ఎప్పుడూ ఈ రక్షకభటులు కావలికాస్తూ ఇటూ అటూ పోనివ్వరు. నేనింకా సుకారీ, లంబాడీ, మరాటీ అంటే స్వేచ్ఛా జీవనానికి ప్రతిబింబా లనుకుంటూండేవాణ్ణి. " అంటూ మిక్కిలి జాలిగా గుంపుకేసి చూడసాగినాను.

అప్పుడింకా పాంధుడన్నాడు " అంత ఇది కాదులేండి. పగలు వాళ్ళిష్టమువచ్చినట్టూ తిరిగి ఊళ్లోయిళ్ళదగ్గిరా కొట్లదగ్గిరా దండోరాచేసి వాళ్ళతవ్వెడుఖియ్యాం డబ్బూ పట్టుకుపోవచ్చును.

సాయంకాలానికి మాత్రం హాజరుపట్టీయిచ్చి పోలీసుహవేళీలో వుండాలి" అన్నాడు.

"వీళ్ళకు ఇళ్లులేవు. వాకిళ్లులేవు. పగలల్లా తిరుగుతూ వుంటారు. రాత్రిళ్ళు పోలీసుకాపలా. అటువంటి పరిస్థితిలో వీళ్ళకురటుంబా లింతవృద్ధికావడం, వీళ్ళకు పసిపాపలు నవ్వు కలిగిస్తూవుండడం, యువతులు గర్భిణీ స్త్రీలై గౌరవనీయంగా కనబడ్డం ఇదంతా ఎక్కడంటావు — ఎప్పుడంటావు — ఆశ్చర్యం లేదోయి నీకు?" అన్నాను పాంధునితో—

పాంధుడు అన్నాడు "వెన్నెలే వాళ్ళకు దుప్పటి, చీకటే వాళ్ళకు బూర్నీసు — అనుకుంటాను" అన్నాడు పాంధుడు — అంటూ వెళ్ళిపోయేడు చిరునవ్వునవ్వుతూ—

ఒక చిన్నకుఱ్ఱవాడు ఆ దండులోంచి విడివడి గబుక్కున పాంధుని కద్దుతగిలి తన కడుపు దీనంగా కొట్టుకొంటూ డబ్బు కావాలన్నట్టు సంజ్ఞచేసినాడు. వాని మొగం మంచి అందంగావుంది. జునపాలువున్నయి. కళ్ళల్లో తేజస్సు ఒలికిపోతూంది. ఒళ్ళంతా కాసువన్నె పోతవిగ్రహంలాగ గనిపిస్తూంది. వాడలాదీనాలాపం ఆడుతూన్నాడు. సంధ్యకాంతి కేసి చూస్తూ తెప్పలాడిస్తూన్నాడు వినోదంగా.

"ఆ బుడుతడి తల్లీ, దండ్రీ ఎవరో!" అని అను కొన్నాను. రక్షకభటుల్లో ఒకడికి అనా అనుకోవడం వినబడి నట్టుగావుంది. అతగాడు అన్నాడు "వాళ్ళకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం, జగత్తంతావాడే" నన్నాడు.

ఆలా అతగాడన్నాడు. కుర్రాడోడబ్బు పాంధుడిదగ్గఱి పుచ్చుకున్నాడు. శ్రద్ధానందఘాటు మెట్లమీద ఇద్దెనలమ్మే

బ్రాహ్మడి దగ్గఱ ఓ ఇడ్డెన్న కొనుక్కున్నాడు. తిన్నాడు. వెంటనే మతోడిదగ్గఱకు పరుగెత్తుకెళ్ళి మళ్ళీ దీనంగా కడుపు కొట్టుకుంటూ మళ్ళీ సంధ్యకాంతికేసి చూస్తున్నాడు.—రక్షక భటుడు "చూడండి అప్పుడే ఆ కుర్రాడు ఎన్నిపోకిళ్లు పోయాడో" అన్నాడు—నేను ఆ కుఱ్ఱవానికేసి చూస్తున్నాను. వాడో అరటిపళ్ళ దుకాణాదారు దగ్గఱకు వెళ్ళి డబ్బివ్వకుండానే ఒక అరటిపండు గెల్లోంచి లాక్కున్నాడు. తింటూ పరుగెత్తుకు పోయిపోయి గుభాల్ను గోదావరిలోపడి ఈతాలాడ్డం ప్రారంభిం చేడు. ఈతాలాడి వొడ్డుకెక్కి వళ్లుతుడుచుకోకుండానే ఓచిన్న పొట్టి నులకమంచం అక్కడవాల్చిన దానిపైని దొర్లేడు. "వాళ్ళకు తండ్రి ఆకాశం, తల్లి భూలోకం" అని రక్షకభటు డన్నమాట మళ్ళీతట్టింది. వానికళ్ళల్లో సంధ్యకాంతి తాండ విస్తూంది—నేను పరకాయిస్తున్నాను.

నాతో మాట్లాడిన రక్షకభటుని బీటు అయిపోయి అతడు గట్టెక్కిపోతూ నన్ను "ఏమిటి ఆలాపరకాయిస్తున్నారు" అన్నాడు. "ఏమీలేదు. నీవన్నముక్కే ఆలోచిస్తున్నాను. ఆకాశంతండ్రి అంటే ఏమిటా, భూలోకంతల్లి అంటే ఏమిటా" అని అన్నాను. రక్షకభటుండు అన్నాడు "బాబూ! మేము ఏ క్షణంవాళ్ళను కాచుక్కూకుంటూ వుంటాము. ఆడదానిమీద ఆకాశం మగాడిక్రింద భూలోకం తప్ప మతేమీ వుండడానికి వీల్లేదు. వాళ్ళకు బిడ్డలుకలిగేరు అంటే ఏమనుకోము? ఆకాశం తండ్రి భూలోకం తల్లి అనుకుంటాము" అన్నాడు. "అంత బాగా కనిపెట్టేవాళ్లు కామట్టే మిమ్మల్ని రక్షకభటు"లన్నారు అని వానితో సామాన్యంగా ఆడేసి వాణ్ణిపంపివేసి నేనూ ఇంటికి వెళ్ళిపోయినాను.

మళ్ళీ ఆ తెగవాళ్ళ పుట్టుపూర్వోత్తరం యోజించసాగినాను. " ఆకాశం తండ్రి, భూలోకం తల్లి ఆ రెండుకలిసేచోటున వాళ్లు ఉద్భవిల్లుతూ ఒకచేనడక ఒకచేనడక ఆ సూర్యచంద్రుల్లాగు ఒకచేనడక నడుస్తూ పోతారు. వాళ్ళకేమిటి ? స్వేచ్ఛ ! వాళ్ళప్రేమ చెట్టునీడనూ, నదీతీరాన్ని, వెన్నెట్లోను, చీకట్లోను విరిసి నృత్యచేస్తూవుంటుంది. వాళ్ళ నొకళ్లు కనిపెట్టడానికి శక్యమా ? పదివేలమంది రక్షకభటులున్నాగానీ రక్షకభటులు లేనివాళ్ళే " అని అలా అనుకుంటూ స్వేచ్ఛగా నిద్రపోయినాను. నిద్రలో స్వేచ్ఛగా కలగన్నాను. నిద్రే రక్షకభటుడు. స్వేచ్ఛగా గన్న నాకలే " సుకారీ, లంబాడీ, మరాటీ "—

.... .... .... .... ....

## పైడయ్యా దరిద్రదేవత

అక్కడకు నాలుగైదు సంవత్సరాలనుంచి పెద్ద గోదావరి, అంటే వంతెనకు దిగువ ఆనకట్టు కెగువనున్న విశాలమైన నీటి ప్రవాహము, వఱద రోజుల్లో కొత్తదారిపట్టి తూర్పుకట్టు కోస్తూ నట్టేట పెద్దపెద్ద ఇసకమేటలు వేయడం రివాజు అయిపోయింది. తుదకు నిరుడు అల్కట్టుతోట కెదురుగుండావున్న పోతగట్టు తెగ్గొట్టుకు పక్కనున్న మాలగూడెమ్మీద పడిపోతుందా అన్నంత అలజడి కలగజేసింది. కాని ఆ ఒడిచుట్టు తప్పింది. " ఈకోతను పుచ్చుకుచూస్తే మేటెక్కడ వేసివుంటుందా " అని అప్పట్లో యోజిస్తే ఎక్కడవేసివుంటుందో ఎవరూ చెప్పలేకపోయినారు కాని గోదావరితీత ప్రారంభించేసరికి కాకినాడ కాలవమొగ ధవళేశ్వరం దగ్గఱది పూర్తిగా కప్పడిపోయింది. పడవలకు